సాక్షి
కుమురం భీం

సోమవారం ; 10 ; జూలై ; 2023



దుర్గమ్మా.. దీవించు

హాజీపూర్ మండలం గఢ్‌పూర్ పంచాయతీ పరిధి ఎంసీసీ క్వారీ దుర్గాదేవి జాతరకు భక్తులు పోటెత్తారు. ఆదివారం ఆలయ ఆవరణలో చండీహోమం నిర్వహించారు. 8లో▸



ఎస్పీఎంతో బీఆర్ఎస్ కుమ్మక్కు

ఎస్పీఎం యాజమాన్యంతో బీఆర్ఎస్ కుమ్మక్కయిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్పీ ఆరోపించారు. కార్మికులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /26.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వానలు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రూ.100కే రాయితీ టికెట్లు

ఆసిఫాబాద్: రూ.100తో కొనుగోలు చేసిన రాయితీ టీ9 టికెట్‌పై ఉదయం 9నుంచి రాత్రి 9గంటల వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వెసులుబాటు కల్పించినట్లు డీఎం శ్రీధర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 12 ఏళ్లు నిండిన బాలికలు, మహిళలతోపాటు 60 ఏళ్లు దాటిన పురుషులకు రాయితీ టికెట్ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ టికెట్‌పై 60కిలో మీటర్ల వరకు ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



దీక్ష శిబిరంలో కూర్చున్న కార్మికులు

ఆసిఫాబాద్: గ్రామపంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లాలోని 14 గ్రామ పంచాయతీల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాలుగోరోజుకు చేరింది. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడారు. 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కారోబార్లు, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్: తాగునీటికి ఇబ్బందులు పడుతున్న తమకు వెంటనే మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని పాడిబండ పంచాయతీ పరిధి వట్టివాగు, డోర్లి, దాంపూర్, యాపలపట్టి, చందుగూడ, మనుకుగూడ గ్రామాల మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వీరికి ఆదివాసీ సేన మండలాధ్యక్షుడు కైలాస్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. గ్రామానికి ఇప్పటి వరకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాలేదని మండిపడ్డారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

కార్యాలయాల తరలింపు



కొత్త కలెక్టరేట్‌కు సామగ్రి తరలిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ భవనానికి సీఎం కేసీఆర్ గత నెల 30న ప్రారంభోత్సవం చేశారు. పెండింగ్ నిర్మాణ పనులు పూర్తయ్యాక ఆదివారం పాత కార్యాలయాల్లోని సామగ్రిని నూతన కార్యాలయానికి తరలించారు. కలెక్టర్ సూచన మేరకు కలెక్టర్, డీఆర్వో, సీపీవో, డీపీవో, డీఈవో, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల కార్యాలయాలను నూతన భవనంలోకి తరలిస్తున్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సదస్సు ప్రచార పోస్టర్‌ను ఆదివారం డీఈవో కార్యాలయం ఎదుట జిల్లా ఐక్యవేదిక ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి మాట్లాడారు. పెన్షన్ పొందడం ప్రతీ ఉద్యోగి హక్కు అని సుప్రీం కోర్టు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఇందులాల్, ఊశన్న, సంజయ్‌కుమార్, లక్ష్మణ్, స్వర్ణలత, హేమంత్, రమేశ్, మధుకర్ తదితరులున్నారు.

మధ్యాహ్నం బంద్..!

- చెల్లించని పెండింగ్ బిల్లులు
- పెరిగిన ధరల ప్రభావం కూడా..
- ఆందోళనబాటలో కార్మికులు
- నేటి నుంచి టోకెన్ సమ్మెలోకి..
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు



కౌటాలలో సమ్మె నోటీస్ అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిలిచిపోనుంది. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం నెలల తరబడి బిల్లులు చెల్లించడం లేదు. పెరిగిన ధరలతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం వీరికి భారంగా మారింది. తప్పనిసరి పరిస్థితుల్లో నేటి నుంచి మూడ్రోజుల పాటు వీరు టోకెన్ సమ్మె చేయనున్నారు. దీంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిలిచిపోనుండగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది.

పెండింగ్‌లో బకాయిలు

జిల్లాలో 1,581 మంది మధ్యాహ్న భోజన కార్మికులున్నారు. వీరికి చెల్లించాల్సిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లాలో దాదాపు ఎనిమిది నెలల బిల్లులు, గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో మొత్తం రూ.కోటి 12లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు కార్మికులు చెబుతున్నారు. ఇటీవల రెండు, మూడు నెలల బిల్లులను విద్యాశాఖ మంజూరు చేసినా.. కార్మికులకు ఇంకా చేరలేదు. ప్రభుత్వం కార్మికులకు పెంచిన గౌరవ వేతనాలు అమలు కావడం లేదు. అప్పు చేసి వంటలు చేస్తున్నా బిల్లులు పెంచడం లేదని కార్మికులు వాపోతున్నారు. కోడిగుడ్ల ధరలు పెరగడంతో వాటిని విద్యార్థులకు అందించడంలేదు. ఇటీవల టమాటా ధర కూడా భారీగా పెరగడంతో అది లేకుండానే పప్పు, కూరలు వండుతున్నారు.

కొత్త మెనూ అమలయ్యేనా?

జిల్లాలో 1,258 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 908 ప్రాథమిక, 180 ప్రాథమికోన్నత, 170 ఉన్నత పాఠశాలలున్నాయి. మొత్తం 96వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం సన్నబియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. వంట నిర్వాహకులే కూరగాయలు, కోడిగుడ్లు, పప్పులు, కారం, నూనె తదితర నిత్యావసరాలు సమకూర్చుకుంటున్నారు. ఏటా మధ్యాహ్న భోజన పథకం విధివిధానాలను ఖరారు చేసే ప్రోగ్రాం అప్రూవల్ బోర్డు గతేడాది నుంచి అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు మొలకలు, బెల్లం, రాగిజావ అందించాలని నిర్ణయించింది. దీని అమలుకు నిర్వాహకులు మరింత ఇబ్బంది పడనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుతం ఇస్తున్న నిధులకు అదనంగా మంజూరు చేయడంతో పాటు సకాలంలో చెల్లింపులు చేస్తేనే కొత్త మెనూ అమలు చేయనున్నట్లు కార్మికులు చెబుతున్నారు.

నేటి నుంచి టోకెన్ సమ్మె

సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు గతంలో ఎంఈవో కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. ఫలితం లేకపోవడంతో ఈ నెల 11, 12, 13 తేదీల్లో విధులు బహిష్కరించి టోకెన్ సమ్మె చేయనున్నారు. ప్రభుత్వం డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 14నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్మికులు ఇప్పటికే అధికారులకు సమ్మె నోటీస్ అందించారు. సోమ, మంగళ వారాల్లో ఎంఈవో కార్యాలయాల వద్ద, బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద టోకెన్ సమ్మె చేయనున్నారు. కాగా, సమ్మె కాలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని డీఈవో అశోక్ ఆదేశాలు జారీ చేయగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కొత్త మెనూ ఇలా..

సోమవారం: కిచిడి, మిశ్రమ కూరగాయల కూర, కోడిగుడ్డు.
మంగళవారం: అన్నం, కూరగాయల కూర, సాంబారు.
బుధవారం: అన్నం, మిశ్రమ కూరగాయల కూర, ఆకుకూర పప్పు.
గురువారం: వెజిటేబుల్ బిర్యాని, మిశ్రమ కూరగాయల కూర.
శుక్రవారం: అన్నం, మిశ్రమ కూరగాయల కూర, సాంబారు, కోడిగుడ్డు.
శనివారం: అన్నం, మిశ్రమ కూరగాయల కూర, ఆకుకూర పప్పు.

కార్మికుల డిమాండ్లు ఇవే..

- పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి.
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి.
- పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలి.
- సబ్సిడీ గ్యాస్, కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలి.
- పథకం నిర్వహణ బాధ్యతలు స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.
- వంట షెడ్లు, పాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించాలి.
- కాటన్ బట్టల యూనిఫాం ఇవ్వాలి. సామాజిక భద్రత కల్పించాలి.
- ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి.
- ఎలాంటి షరతులు లేకుండా బ్యాంక్ ద్వారా రుణాలివ్వాలి.
- ప్రభుత్వమే గుర్తింపు కార్డులు, ప్రొసీడింగ్ ఆర్డర్ ఇవ్వాలి.

అప్పు చేసి వండి పెడుతున్నం



బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు. అప్పు చేసి మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నం. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లిస్తేనే గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వం డిమాండ్లు నెరవేర్చకుంటే ఏజెన్సీ రద్దు చేసుకుంటం. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలె.

– లక్ష్మి, కార్మికురాలు, కౌటాల

సమ్మె సక్సెస్ చేయాలి



మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు ప్రభుత్వం అందించే చార్జీలు సరిపోవడం లేదు. అప్పు చేసి మెనూ ప్రకారం విద్యార్థులకు వండిపెడుతున్నం. సమస్యలు పరిష్కరించాలని నేటి నుంచి మూడ్రోజులు టోకెన్ సమ్మె చేయనున్నాం. కార్మికులంతా విజయవంతం చేయాలి.

– శారద, సంఘం జిల్లా అధ్యక్షురాలు

మధ్యాహ్న భోజనం అందిస్తాం



మధ్యాహ్న భోజన కార్మికులు మూడ్రోజులు టోకెన్ సమ్మె చేయనున్నారు. కాగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. తప్పకుండా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తాం. విద్యార్థులు పాఠశాలకు రావాలి. కార్మికులు సమ్మెను పొడిగిస్తే ఇబ్బందులు పెరుగుతాయి.

– మార్త రమేశ్, హెచ్ఎం, కౌటాల

సేంద్రియ సాగుతో లాభాలు

- ఈ నెల 20దాకా పత్తి విత్తుకోవచ్చు
- సాగుకు అనుకూలించని వానలు
- లోటువర్షపాతంతో రైతుల అవస్థలు
- వరిలో స్వల్ప రకం సాగు చేయాలి
- 'సాక్షి'తో డీఏవో శ్రీనివాసరావు



శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆసిఫాబాద్‌రూరల్: వానాకాలం సాగుకు వర్షాలు అనుకూలంగా లేవని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వర్షం కురిసి 15నుంచి 20 ఇంచుల మేరకు నేల తడిసిన తర్వాత విత్తుకుంటేనే సాగు సవ్యంగా ఉంటుందని తెలిపారు. ఈ నెల 20 దాకా పత్తి సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి సహకరించకుంటే కంది, జొన్న సాగు చేసుకోవాలని సూచించారు. సేంద్రియ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని వివరించారు. లోటు వర్షపాతం కారణంగా జిల్లా రైతాంగం ఇబ్బందులు పడుతుండగా జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు సూచనలు చేశారు.

సాక్షి: వానాకాలం సాగుపై లోటు వర్షపాతం ఎలాంటి ప్రభావం చూపుతుంది?

డీఏవో: జిల్లాలో జూన్‌లో సగం వానలే కురిశాయి. లోటు వర్షపాతంతో విత్తనాలు సరిగా మొలకెత్తలేదు. రైతులు మరోసారి విత్తుతున్నారు. దీంతో పెట్టుబడి పెరగడమే కాకుండా దిగుబడిపై ప్రభావం పడనుంది.

సాక్షి: వరినార్లు ఎప్పటివరకు పోసుకోవచ్చు?

డీఏవో: నీటి వసతి ఉన్నవారు ఇప్పటికే వరినార్లు పోసుకున్నారు. లోటు వర్షపాతంతో చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వరిలో స్వల్పకాలిక విత్తనాలను ఎంచుకుని ఆగస్టు వరకు నార్లు పోసుకోవచ్చు.

సాక్షి: రైతులకు సబ్సిడీపై ఏయే విత్తనాలు ఇస్తున్నారు?

డీఏవో: 100శాతం సబ్సిడీపై జిల్లా రైతులకు ఇప్పటికే కంది, సోయాబీన్ విత్తనాలు అందించాం.

సాక్షి: చిరుధాన్యాలు సాగు చేయాలని రైతులను ప్రోత్సహిస్తున్నారా?

డీఏవో: గతేడాది కలెక్టర్ చొరవతో రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి జొన్న, కొర్రలు, సాములు తదితర రకాల చిరుధాన్యాల విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేశాం. కానీ.. అధిక వర్షపాతం పంటలపై ప్రభావం చూపి సాగు చేసిన రైతులు నష్టపోయారు. దీంతో ఈసారి చిరుధాన్యాల సాగుకు ఎవరూ ముందుకు రాలేదు. ఇందుకు అనుకూలమైన నేలలు కూడా మన జిల్లాలో లేవు.

సాక్షి: వానాకాలం సాగుపై రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు..?

డీఏవో: అవసరానికి మించి రసాయన ఎరువులు వాడొద్దు. పత్తి సాగుకు ముందు దుక్కిలో గాని, విత్తిన నాలుగురోజుల్లోపు గాని ఎకరాకు 30నుంచి 40 కేజీల డీఏపీ మాత్రమే వాడాలి. విత్తనం మొలకెత్తాక డీఏపీ వేయొద్దు. పత్తి మొలకెత్తిన 20రోజులకు నేలలో మంచి తేమశాతం ఉన్నప్పుడు ఎకరాకు 20 నుంచి 30 కేజీల యూరియాలో 15 నుంచి 20 కేజీల పొటాష్ కలిపి సాగు కాలం పూర్తయ్యే దాకా మూడు లేదా నాలుగుసార్లు (25నుంచి 30రోజుల వ్యవధిలో) వేసుకుంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తుంది. సేంద్రియ ఎరువులతో భూసారం కూడా పెరుగుతుంది.

సాక్షి: నోవా ద్రవరూప యూరియా సాగుకు అనుకూలమేనా?

డీఏవో: ఈ సంవత్సరం నోవా ద్రవరూప యూరియా వచ్చింది. ఎకరాకు లీటర్ చొప్పున వాడుకోవచ్చు. దీంతో రైతుకు పెట్టుబడి కూడా చాలా తక్కువ అవుతుంది. ఈ సంవత్సరం వాడితే గాని దాని ప్రయోజనం తెలియదు. ద్రవరూప యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

సాక్షి: జిల్లాలో వానాకాలంలో సాగయ్యే పంటలు.. సాగు విస్తీర్ణం?

డీఏవో: జిల్లాలో 4.51లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అత్యధికంగా 3,35,178 ఎకరాల్లో పత్తి, 54,611 ఎకరాల్లో వరి, 46,096 ఎకరాల్లో కంది, 3,017 ఎకరాల్లో పెసర, 1,524 ఎకరాల్లో సోయా సాగవుతోంది. వీటితోపాటు కూరగాయలు, పండ్ల తోటలు కూడా సాగు చేస్తున్నారు.

సాక్షి: భూసారం పెంపునకు ఏం చేయాలి?

డీఏవో: భూసారం పెంచుకునేందుకు సాధ్యమైనంత వరకు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలి. జిల్లాలో అత్యధికంగా సాగు చేసే పత్తిలో అంతరపంటగా కంది, బబ్బెర, మినుము, మొక్కజొన్న సాగు చేస్తే భూసారం పెరుగుతుంది. పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా సంబంధిత ఏఈవోలను సంప్రదించాలి.

దరఖాస్తు చేసుకోవాలి

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఎస్కేఈ డిగ్రీ కళాశాలలో ప్రవేశం కోసం ఈనెల 14వ తేదీలోపు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు సమయంలో విద్యార్థులకు ఏదైన సాంకేతిక సమస్య ఎదురైతే కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.


అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి



పోటీలు ప్రారంభిస్తున్న సీఐలు సురేశ్, రమేశ్

ఆసిఫాబాద్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కలెక్టర్ సతీమణి రేవతి హేమంత్ బోర్కడే సూచించారు. జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్‌టు ఆల్ చెస్ పోటీలను ఆమె ఆదివారం ప్రారంభించారు. ఐదు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బెస్ట్ ఫైవ్ క్రీడాకారులను ఎంపిక చేయగా, వీరిలో మంచిర్యాలకు చెందిన మయూర్ కైవల్య, రేపల్లెవాడకు చెందిన అజయ్, చెన్నూర్‌కు చెందిన సమ్మయ్య, మందమర్రికి చెందిన మని రక్షిత్, రామకృష్ణాపూర్‌కు చెందిన పీ శివరామకృష్ణ బహుమతులు దక్కించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఐ సురేశ్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్‌బాబు, చెస్ అసోసియేషన్ నాయకులు ఎండీ సిరాజ్ ఉల్ రహమాన్, ఈగ కనకయ్య, సీఐ రమేశ్, ఆర్బిట్రేటర్ కల్పన, టోర్నమెంట్ కన్వీనర్ రాజేంద్రప్రసాద్, ఆకసం ప్రతినిధి వెంకటేశ్వర్లు, శంకర్, రవీందర్, గోపాలకృష్ణ, పీడీలు తిరుపతి, రాకేశ్, కార్తీక్, కిరణ్, యాదగిరి, హెచ్ఎం కోటేశ్వర్‌రావు, ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రమాదకర రీతిలో పశువుల రవాణా



తాటిపల్లి వద్ద పెన్‌గంగానదిలో ప్రమాదకరంగా మూగజీవాలను తరలిస్తున్న వ్యాపారులు

కౌటాల: మండలానికి సరిహద్దులోని మహారాష్ట్రలోగల ధరూర్‌లో ఆదివారం పశువుల సంత నిర్వహించగా దళారులు మూగజీవాలను కొనుగోలు చేశారు. దూరభారం తగ్గించడానికి ఉధృతంగా ప్రవహిస్తున్న పెన్‌గంగా నదిలో పడవకు పశువులను కట్టి ఇతర ప్రాంతాలకు దాటిస్తున్నారు. ఒక్కో నాటు పడవ చుట్టూ సుమారు 20కి పైగా పశువులను కట్టి ప్రమాదకర రీతిలో నది గుండా దాటిస్తుండడాన్ని స్థానికులు చూసి నివ్వెరపోతున్నారు. రోడ్డు మార్గం ద్వారా నది అవతలివైపునకు వెళ్లాలంటే సుమారు 120 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. అదే నదిలో అయితే 20 కిలో మీటర్లు ప్రయాణిస్తే ఆవలి ఒడ్డుకు చేరుకోవచ్చు. ప్రస్తుతం నదిలో వరద ఉధృతి ఎక్కువ ఉన్నందున మూగజీవాలను తరలిస్తున్న క్రమంలో ప్రమాదం జరిగితే వాటితోపాటు నాటుపడవల్లో ప్రయాణించే వ్యాపారులూ మృత్యువాత పడే ప్రమాదముంది.

అంధకారంలో మహారాజ్‌గూడ

- పూర్తి స్థాయిలో వేయని స్తంభాలు
- మూడు నెలలైనా పూర్తికాని పనులు
- సరఫరా కాని తెలంగాణ విద్యుత్
- నాణ్యతలేని మహారాష్ట్ర కరెంట్
- చీకట్లో మగ్గుతున్న గ్రామస్తులు
- సరిహద్దులో ఉండడంతోనే సమస్య



అలంకారప్రాయంగా డీటీఆర్



అతి దగ్గరగా తెలంగాణ, మహారాష్ట్ర స్తంభాలు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన ముకదంగూడ పంచాయతీ పరిధి మహారాజ్‌గూడ అంధకారంలో మగ్గుతోంది. ఈ గ్రామం రెండు రాష్ట్రాల పరిధిలో ఉండడంతో మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాలు విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. గ్రామంలో 90 కుటుంబాలుండగా.. 428 మంది జనాభా ఉంది. గత మార్చి 20న తెలంగాణ ప్రభుత్వ విద్యుత్‌శాఖ అధికారులు గ్రామంలో 25 స్తంభాలు, ఒక డీటీఆర్‌ను అమర్చారు. మరో 30 స్తంభాలు అవసరముండగా నేటివరకు తెప్పించలేదు. పూర్తి స్థాయిలో స్తంభాలు వేయనందున గ్రామానికి విద్యుత్ సరఫరా చేయడంలేదు. ఇందుకోసం అమర్చిన డీటీఆర్ అలంకారప్రాయమైంది. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ పనులు చేపట్టగా ఇప్పటిదాకా కరెంట్ సరఫరా చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలలుగా పట్టించుకోవడంలేదు. దీంతో గ్రామస్తులు చీకట్లో మగ్గుతున్నారు. కాగా, ఇప్పటికే కోటా, పరంధోళి, ముకదంగూడ గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ సరఫరా చేస్తున్నా ఇప్పటివరకు ఒక్కరూ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేయలేదని అధికారులు పేర్కొన్నారు.

నాణ్యత లేని 'మహా' కరెంట్..

మహారాష్ట్ర ప్రభుత్వం మహారాజ్‌గూడ గ్రామానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. ఇందుకు సంబంధించిన సబ్‌స్టేషన్ జివితి గ్రామంలో ఉంది. ఇక్కడ ఏదైనా సమస్య వస్తే జివితికి వెళ్లి సరి చేసుకోవాల్సిందే. పైగా మహారాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న విద్యుత్ నాణ్యమైనది కాకపోవడంతో విద్యుద్దీపాలు సరిగా వెలగడంలేదు. ఫ్యాన్లు తిరగవు. ఫ్రిడ్జ్, కూలర్లు పని చేయవు. తెలంగాణ ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. తరచూ అంతరాయమేర్పడుతున్నా.. మరే సమస్య తలెత్తినా మరమ్మతు చేయడంలేదు. కరెంట్ సమస్యపై మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులను అడిగితే తెలంగాణ ప్రభుత్వమే సరఫరా చేస్తోంది కదా.. అని దాట వేస్తున్నారు.

తెలంగాణ విద్యుత్ నాణ్యతగా ఉన్నా..

తెలంగాణ ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నా గ్రామానికి పూర్తి స్థాయిలో అందడంలేదు. ఇక్కడ నివసించే వారంతా లంబాడాలు కావడంతో తెలంగాణ ప్రభుత్వం ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందించింది. కాగా, గ్రామంలో గతంలోనే 40 పట్టాలు అందించగా.. ఇటీవల మరో 45 ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందించారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తే వీరు రెండు పంటలు పండించే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి సరిపడా స్తంభాలు వేసి విద్యుత్ సరఫరా చేయాలని మహారాజ్‌గూడ వాసులు కోరుతున్నారు.

వెంటనే స్తంభాలు వేయాలి



మహారాజ్‌గూడ గ్రామంలో సగం వరకే స్తంభాలు వేశారు. మరో 30 స్తంభాలు వేయాల్సి ఉంది. కానీ.. ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. తెలంగాణ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నం. అధికారులు స్పందించి స్తంభాలు వేయాలి.

– పతంగే లింబాదాస్, సర్పంచ్, ముకదంగూడ

ఇంటి కనెక్షన్లు తీసుకుంటాం



గ్రామంలో విద్యుత్ సరఫరా చేస్తే ఇంటి కనెక్షన్‌కు దరఖాస్తు చేస్తాం. కానీ.. ఇంతవరకు సగం గ్రామంలోనే తీగలు లాగి వదిలేశారు. స్తంభాలు లేవని విద్యుత్ సరఫరా చేస్తలేరు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తే రెండు పంటలు పండించవచ్చు.

– జాదవ్ ఉమాజీ, మహారాజ్‌గూడ

ప్రతిపాదనలు పంపిస్తాం



ఇప్పటివరకు మంజూరైన నిధులతో స్తంభాలు ఏర్పాటుచేశాం. మరిన్ని నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. గ్రామస్తులు స్తంభాల కోసం దరఖాస్తు ఇవ్వాలి. నిధులు మంజూరు కాకుండా ఏమీ చేయలేని పరిస్థితి. ప్రజలు ఓపిక పట్టాలి.

– శ్రీనివాస్, విద్యుత్‌శాఖ ఏడీఈ

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో జీపీ వర్కర్ మృతి


మల్లేశ్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ గంగాధరి మల్లేశ్ (49) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జీపీ మల్టీపర్పస్ వర్కర్ విధుల్లో భాగంగా మల్లేష్ పంపు ఆపరేటర్‌గా, స్ట్రీట్‌లైట్ల బిగింపు పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం విద్యుత్ స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెంది స్తంభం పైనుంచి కిందపడిపోయాడు. కాగా అతడు విద్యుత్ స్తంభానికి స్ట్రీట్‌లైట్ బిగించేందుకు ఎక్కాడా? లేదా ఏదైన మరమ్మతు కోసం ఎక్కాడా? అనేది మాత్రం తెలియడం లేదు. ఘటన స్థలాన్ని లక్సెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు. మృతుడికి భార్య వెంకటవ్వ, కుమారులు రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

'మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం'


సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్

పాతమంచిర్యాల: మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడ, శ్రీకృష్ణ కాలనీలో గడపగడపకూ బీజేపీ కార్యాక్రమంలో భాగంగా వీధులలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీరాలంటే ఎమ్మెల్యే మారాలని, లక్షల రూపాయలు వెచ్చించి ఇండ్లు నిర్మాణం చేసుకుని వేల రూపాయలు పన్నులు కడుతున్న ప్రజలకు కనీస వసతులు ప్రభుత్వం కల్పించకపోవడం దారుణమన్నారు. డ్రైనేజీలు, రోడ్లు, మంచినీటి వసతి వార్డుల్లో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ మల్లిఖార్జున్, పూదరి రమేష్, ముదాం మల్లేష్, హరికృష్ణ, జాడి సత్యనారాయణ, రాకేష్ రేణ్వా, అశోక్, చక్రి, పోలింగ్ బూత్ అధ్యక్షుడు తాజ్‌ఖాన్, రాకేష్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా


బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: వీకెండ్ సెలవులు రావడంతో ఆదివారం కడెంలో పర్యాటకులు సందడి చేశారు. ప్రాజెక్ట్ పరిసరా ప్రాంత అందాలను తిలకించారు. బోటు షికారు చేస్తూ ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు.

డాక్టర్ తీరు మారలే..?

నేరడిగొండ: విధులు సక్రమంగా చేపట్టకుండా ఇది వరకే ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ డాక్టర్ తీరు ఇంకా మారలేదు. గత బుధవారం పీహెచ్‌సీకి చెందిన ఓ స్టాఫ్‌నర్సు జిల్లా వైద్యాధికారికి ఆయనపై ఫిర్యా దు చేసినట్టు తెలుస్తోంది. అయితే సదరు డాక్టర్ ఆమెపై దురుసుగా ప్రవర్తించినందుకే ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి ఆమెకు తెలిపినట్లు సమాచారం. కాగా సదరు వైద్యుడు విధులకు డుమ్మా కొట్టినప్పటికీ రిజిస్టర్‌లో మాత్రం హాజరు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏదైన పని నిమిత్తం సెలవు అడిగితే మంజూరు చేయడం లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇలాంటి సంఘటలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులను వైద్య సిబ్బంది, మండల ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కుంటాల: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. మండలంలోని కుంటాల–అంబకంటి రోడ్డు మార్గంలో ఎస్సై ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా, ముగ్గురు మద్యం తాగినట్లు రుజువైంది.

దుర్గమ్మా.. దీవించు

- ఘనంగా క్వారీ జాతర
- పోటెత్తిన భక్తజనం...
- అమ్మవారిని దర్శించుకున్న నేతలు


పోచమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు, నాయకులు


క్వారీ దుర్గాదేవి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): క్వారీ దుర్గాదేవి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం దుర్గాదేవి ఆలయ ఆవరణలో చండీహోమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల అనంతరం అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. దుర్గామాత దర్శనం అనంతరం పోచమ్మ, నాగదేవతలకు పూజలు చేశారు. భక్తుల తాకిడితో క్వారీ వనం జనసంద్రంగా మారింది.

పెద్ద సంఖ్యలో ప్రముఖుల రాక...

క్వారీ దుర్గాదేవి జాతరకు భక్తులతో పాటు పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు –రాజకుమారి దంపతులతో పాటు మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వి.ప్రతాప్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్‌లు దుర్గాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్ కుటుంబ సభ్యులు, ఏసీపీ ఎడ్ల మహేశ్ తదితర ప్రముఖులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. గఢ్‌పూర్ సర్పంచ్ ఏదుల లక్ష్మి–భూమన్న, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ఉదయం నుంచే పెరిగిన భక్తుల తాకిడి...

ఆదివారం క్వారీ దుర్గాదేవి జాతరకు ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. అయితే క్వారీ జాతరలో ఉదయం 5గంటల నుంచి భక్తులు క్వారీ జాతరకు తరలి వస్తుండడంతో మధ్యాహ్నం వరకు భారీ సంఖ్యలో తరలివచారు. మధ్యాహ్నం వరకు భక్తుల రాక అధికం కావడంతో ఆలయం, పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆర్టీసీ బస్సుల నిలిపివేత..

క్వారీ దుర్గాదేవి జాతరకు ఆర్టీసీ బస్సులు వేసింది. అయితే పోలీసులు క్వారీ గుట్టపైకి అనుమతి ఇవ్వకపోవడంతో ఆర్టీసీ బస్సులు నిలిపివేసింది. దీంతో భక్తులు జాతరకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. అలాగే భారీ వాహనాలు కూడా గుట్టపైకి అనుమతి ఇవ్వకపోవడంతో కొంత మేర ట్రాఫిక్ సమస్యలు తీరాయి.


బోనాలతో మహిళలు

భారీగా పోలీస్ బందోబస్తు...


పోలీసుల భారీ బందోబస్తు

మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో మంచిర్యాల పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంచిర్యాల సీఐ రాజు, రూరల్ సీఐ తోట సంజీవ్‌లతో పాటు పలువురు సీఐలు, ఎస్సైలతో పాలు పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది క్వారీ జాతర బందోబస్తులో భాగస్వామ్యమయ్యారు. జాతరలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు.


భక్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు


నాగదేవత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


దుకాణాల్లో భక్తుల కొనుగోళ్లు


జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

32 ఏళ్ల తరువాత కలుసుకున్నారు...


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాల (తెలుగు మీడియం) విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సరిగ్గా 32ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో కలిసి పదో తరగతి వరకు చదువుతున్న పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరి ఆత్మీయతను పంచుకున్నారు. ఆదివారం తాపీ సంఘం భవనంలో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మెళనానికి హాజరయ్యారు. సుదూరప్రాంతాల్లో నివాసం ఉంటున్న చిన్ననాటి స్నేహితులు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తోటి స్నేహితుల మృతికి సంతాపం తెలిపారు. అనంతరం గురువులకు పూల మాలవేసి శాలువతో సన్మానించారు.

ఆత్మీయ కలయిక..


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి 2003–04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. విద్యార్థులు కలిసి అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తున్న వారు ఒకరితో ఒకరు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గౌతం, దామోదర్, అనిల్, రమేశ్, మహేశ్, శ్రీనివాస్, కరుణ, కల్పన, రాజ్యలక్ష్మి, స్వప్న, విద్య పాల్గొన్నారు.

రైల్వే పైవంతెనకు మరమ్మతులు


మూసివేసిన పైవంతెన...

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలోని రైల్వే పై వంతెనకు మరమ్మతులు జరుగుతున్నాయి. గడిచిన కొద్ది రోజుల నుంచి వంతెనను మూసి వేసి పనులను నిర్వహిస్తున్నారు. వంతెన మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరమ్మతుల కారణంగా రెండో నెంబర్ ఫ్లాట్ ఫామ్ నుంచి రైల్వే కాలనీకి వెళ్లే మార్గాన్ని మూసి ఉంచారు. ప్రత్యేకంగా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, రైల్వేకాలనీ వాసులు ఆ మార్గం మీదుగా రాకపోకలు సాగించకుండా నిలువరించారు. ఈ కారణంగా రైల్వే కాలనీ వాసులు, రైల్వే ఉద్యోగులు కాల్‌టెక్స్ ఏరియా మీదుగా రైల్వేస్టేషన్‌కు వచ్చి వెళ్తున్నారు. ఉద్యోగులు విధులకు హాజరవుతున్నారు. సత్వరంగా పైవంతెన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైల్వే కాలనీవాసులు, రైల్వే ఉద్యోగులు కోరుతున్నారు.

మేమున్నాం..

- అభయమిస్తున్న మెంటల్ హెల్త్ క్లినిక్
- జిల్లా ఆస్పత్రిలో రెండు నెలల క్రితం ఏర్పాటు
- విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా అవగాహన
- దురలవాట్లు, మానసిక సమస్యలకు చికిత్స
- 14416 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సలహాలు, సూచనలు



మానసిక, డిప్రెషన్ సమస్యల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు


అవగాహన కల్పిస్తున్న సైక్రియాటిస్టు సునిల్‌కుమార్(ఫైల్)

మంచిర్యాలటౌన్: మానసిక సమస్యలు, నిద్రలేమి, మత్తు పదార్థాలకు, పొగాకుకు బానిసలుగా మారిన వారితో పాటు, ఆత్మహత్యకు ప్రయత్నించిన వారు, పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చే వారికి సైక్రియాటిస్టు ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి వారిలోని సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని జిల్లా ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన మెంటల్ హెల్త్ క్లినిక్‌లు అభయాన్ని ఇస్తున్నాయి. అన్ని జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో వీటిని ఈ ఏడాది మే 4వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కలెక్టర్ బదావత్ సంతోశ్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. రెండు నెలల్లోనే ప్రతిరోజు పదికి పైగా మానసిక ఆరోగ్య క్లినిక్‌లకు వస్తున్నారు. ఎక్కువగా ఆత్మహత్య చేసుకోవాలని అనుకునే వారు, ఆయా ప్రయత్నాలు చేసిన వారే అధికం. ఒక సైక్రియాటిస్టును నియమించి సమస్యలతో వచ్చిన వారికి కౌన్సెలింగ్‌ను ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి మందులను, తప్పనిసరిగా ఆస్పత్రిలో చేర్చుకోవాల్సిన వారిని ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకుని వైద్య సేవలను సైతం అందిస్తున్నారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు ఓపి సమయంలో ఈ క్లినిక్‌లను తెరిచి ఉంచుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారికి ఉన్న సమస్యలకు తగిన సలహాలు, సూచనలు, అవసరమైన చికిత్సను తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వారి కోసం టెలిమానస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సైతం ఏర్పాటు చేసి ఎప్పుడైనా ఈ నంబర్‌కు ఫోన్ చేసి, అవసరమైన సలహాలను పొందేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

మానసిక సమస్యలే ఎక్కువ...

ప్రస్తుత కాలంలో పలువురు పలు రకాల మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. చాలా మంది ఆత్మనూన్యతాభావానికి గురవుతూ ఏకాగ్రత లోపం, లేనివి ఉన్నట్లుగా భ్రమపడటం, స్వీయ నియంత్రణ లేకపోవడం, తనతో తాను మాట్లాడుకోవడం, నిందించుకోవడం, గాభారా పడి ఆందోళన, భయం, గుండె దడతో పాటు, సెక్స్ సంబంధిత సమస్యలు, మానసిక కుంగుబాటు, మేనియా (బైపోలార్ డిజార్డర్) అంటే అతిగా మాట్లాడడం వంటి సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. తనలో తాను మాట్లాడుకోవడం, ఇతరులతో మాట్లాడుతున్న సమయాల్లో నవ్వుతూనే ఒక్కసారిగా కోపాన్ని ప్రదర్శించడం, ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం, మద్యపానం, దూమపానం, పొగాకు, మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారికి ఈ మానసిక ఆరోగ్య క్లినిక్‌లో సైక్రియాటిస్టు ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లా ప్రజలు ఇప్పుడిప్పుడే ఈ క్లినిక్ ద్వారా వైద్య సేవలను అందుకుంటుండగా ఆస్పత్రికి వచ్చేందుకు ఇబ్బందిగా అనుకునే వారి కోసమే ప్రత్యేకంగా టెలీమానస్ 14416 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తెచ్చారు.

సమస్యలున్న వారు వస్తున్నారు...



మానసిక అనారోగ్యానికి సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు మానసిక ఆరోగ్య క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు పది మందికి పైగా పలువురు సమస్యలతో బాధపడుతున్నవారు వచ్చి చికిత్స తీసుకుంటున్నారు. ఆస్పత్రి వరకు రాలేని వారి కోసం టెలీమానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించి అనుమానాలు, చికిత్స విధానం, ఇతరాత్ర వాటిపై అడిగి తెలుసుకునేందుకు అవకాశం ఉంది. అధికంగా స్మార్ట్ ఫోన్‌ను వాడే చిన్నారులకు సైతం ఈ క్లినిక్ ఉపయోగపడుతున్నాయి.

– సునీల్‌కుమార్, సైక్రియాటిస్టు

కాంగ్రెస్‌లో చేరికలు

పాతమంచిర్యాల: మంచిర్యాల మున్సిపాలిటీలోని 25వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు 150 మంది ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలు నచ్చక వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో సుపరిపాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యులు కొండా చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కౌన్సిలర్ రామగిరి బానేష్, పట్టణ ఉపాధ్యక్షులు జోగుల సదానందం, మైనార్టీ నాయకులు ఇర్ఫాన్ పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం నుంచి బైక్ చోరీకి గురైనట్లు టూ టౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. ఆయన కథ నం ప్రకారం.. ఈనెల 2న జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో హోంగార్డు ఆకుల వెంకటరమణ బైక్‌ను పార్క్‌చేసి తన స్నేహితుడిని బస్సు ఎక్కించాడు. తిరిగి వచ్చి చూసేసరికి తన బైక్ కనిపించలేదు. చుట్టుపక్కలా వెతికినా దొరకలేదు. ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో కూలీగా పనిచేస్తున్న చింతల కపిల్ (35) మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. దీంతో భార్య కృష్ణవేణి మందలించింది. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన కపిల్ కేఆర్‌కే కాలనీలో పురుగుల మందు తాగి మృతిచెందిన విషయం ఆదివారం కుటుంబీకులకు తెలిసింది. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వాడబలిజల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- వాడబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు బోడెంకి మహేశ్
- గంగాదేవికి ప్రత్యేక పూజలు చేసిన నాయకులు


పూజలు చేస్తున్న వాడబలిజ సంఘం నాయకులు

పాతమంచిర్యాల: వాడబలిజల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బోడెంకి మహేష్ మహేష్ అన్నారు. జిల్లాలోని పాత మంచిర్యాల శివారులోని గంగాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. వాడబలిజలు అనాధిగా పడవలు నడుపుతూ, చేపలవేట కొనసాగిస్తూ నదీతీర ప్రాంతాలలో నివాసం ఉంటూ కాలం గడుపుతున్నారన్నారు. వాడ బలిజలను సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మత్స్యశాఖ సొసైటీలలో వాడ బలిజలకు ప్రత్యేకస్థానం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మండల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మంచిర్యాల మండల వాడబలిజ సంఘం మండల అధ్యక్షుడిగా గగ్గూరి సత్తయ్య, కార్యదర్శిగా బోడెంకి కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వాడ బలిజ సంఘం నాయకులు గగ్గూరి రాజన్న, గారే శంకర్, బొల్లె ల్లే శ్రీనివాస్, సత్తన్న, దేవేందర్, సంజయ్, నగేష్, రాజన్న, మనోజ్ నాగమణి, వరుణ్, కృష్ణ, పరశురాం, మధునయ్య, రమేష్ పాల్గొన్నారు.